

ముక్కకు ముద్ర ఉండాల్సిందే...!



గోపాలపట్నంలోని మటన్ దుకాణం వద్ద క్యూ కట్టిన జనం



విశాఖ విద్య: బర్డ్ ఫ్లూ భయం మాంసాహారులను వెంటాడుతోంది. జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రభావం ఏమాత్రం లేదని అధికారులు చెబుతున్నా చికెన్ కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. దీంతో మటన్ విక్రయాలకు గిరాకీ పెరిగింది. ఆదివారం వస్తే చాలు ముక్క లేనిదే ముద్ద దిగని పరిస్థితి. మరి ఆ ముక్కకు ముద్ర ఉందా? ముక్క తెలుసు కానీ, ముద్ర ఏంటని ఆలోచిస్తున్నారా? మనం తినే మాంసం మంచిదేనా? అని తెలియాలంటే ముక్కకు ముద్ర ఉండాల్సిందే. మటన్ వ్యాపారులు మంచి మాంసమే ఇస్తున్నారా? ఆరోగ్యంగా ఉన్న మాంసాన్నే కోశారా? ఇదంతా ఎలా తెలుసుకోవాలి? కొన్నామా, తిన్నామా కాదు. తినే మాంసం పట్ల అలసత్వం వహిస్తే ఆరోగ్యానికే ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

- మటన్ కొనేటప్పుడు అధికారిక ముద్ర చూడాలి
- నగరంలో నిబంధనలు పాటించని వ్యాపారులు
- కొందరు షాపుల వద్దే మేకల వధ
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
- బర్డ్ ఫ్లూ ప్రచారంతో మటన్ విక్రయాల జోరు

బర్డ్‌ఫ్లూ ప్రచారంతో

బర్డ్‌ఫ్లూ ప్రచారంతో చికెన్ వ్యాపారాలు పడిపోగా..మటన్ వ్యాపారం ఊపందుకుంది. దీనిని ఆసరా చేసుకుని కొందరు మటన్ వ్యాపారాలు నిబంధనలు గాలికి వదిలేశారు. ధరలు కూడా అమాంతం పెంచేశారు. నిన్నామొన్నటి వరకు కిలో రూ.800 ఉంటే మటన్..ప్రస్తుతం రూ1000 విక్రయిస్తున్నారు. ఒకే సారి ఇలా రూ.200ల వరకు ధర పెంచేయడంపై వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మటన్ తినాలనే జనం ఆసక్తిని వ్యాపారులు ఇలా సొమ్ము చేసుకోవటం ఎంత వరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. దుకాణదారులు అడిగిన డబ్బులు ఇవ్వకుంటే, మా దగ్గర మటన్ లేదని మొహంమీదే చెప్పేస్తున్నారు. మటన్ విక్రయాలపై ధరల నియంత్రణకు సంబంధిత అధికారులు దృష్టి పెట్టకపోవటంతో ప్రజానీకంపై ఆదనపు భారం తప్పటం లేదు. ఒక్కో మటన్ వ్యాపారి ఆదివారం ఒక్కరోజు రూ.లక్ష వరకు విక్రయాలు జరుపుతున్నాడు.



వెలవెలబోతున్న చికెన్ షాపు

మటన్ మంచిదేనా?

మాంసం వ్యాపారులు విక్రయాల్లో నిబంధనలు పాటించడం లేదు. జీవాలు ఆరోగ్యమైనవేనా? లేదా? ధ్రువీకరించాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వారు ఇష్టానుసారంగా విక్రయాలు జరుపుతున్నారు. నిబంధనల ప్రకారం శానిటరీ ఇన్‌స్పెక్టర్, పశు సంవర్ధక శాఖ వైద్యుడు పరిశీలించాలి. వీరి పర్యవేక్షణలో వధించిన మాంసంపై ముద్ర (రౌండ్ సీల్) వేసినది మాత్రమే విక్రయించాల్సి ఉంటుంది. విశాఖలో నిత్యం వేల కిలోల మాంసం అమ్మకాలు జరుగుతుంటాయి. కానీ అధికారులు ఎక్కడా తనిఖీలు చేయట్లేదు. దీంతో విచ్చలవిడిగా మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. సగానికిపైగా వ్యాపారులు ఇళ్ల, దుకాణాల వద్దనే వధిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా రోగాల బారినపడినవి, వయసు పైబడిన వాటిని కూడా వధించి విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

పాడైన మటన్‌తో ఆరోగ్య సమస్యలు

కొంతమంది వ్యాపారులు వ్యాధులతో ఉన్న మేక, గొర్రెలను వధిస్తున్నారు. వాటి మాంసం తిన్న వారికి వెంటనే కడుపునొప్పి రావటం, అనారోగ్యం బారిన పడుటం జరుగుతోంది. అదే విధంగా సవ్యంగా జీర్ణం కాక, తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయి. కుళ్లిన మాంసం కూడా కొంతమంది విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో కళ్ల ముందే ఈ తంతు సాగుతున్నా, నగర పాలక సంస్థ అధికారులు చోద్యం చూస్తుండటంలో ఆంతర్యమేమిటనే ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కొంతమంది మటన్ వ్యాపారాలు సాగిస్తున్న దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ప్రజానీకం కోరుతున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రామకృష్ణ నగర్‌లో రిటర్నింగ్ వాల్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు రామకృష్ణ నగర్‌లో కొండవాలు ప్రాంతంలో జరుగుతున్న రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే గణబాబు పరిశీలించారు. గత ఏడాది కురిసి వర్షాలకు కొండ చరియలు విరిగి పడిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో జీవీఎంసీ నిధులు రూ.2 కోట్లతో రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టారు. కొంత మేరకు వాల్ నిర్మించి తరువాత కాంక్రీట్‌తో సపోర్టింగ్ వాల్‌ను శనివారం నిర్మించారు. ఈ పనులను గణబాబు పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు నారిపినని సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు అందజేత



సత్యవతికి నిత్యావసర సరకులు అందజేస్తున్న దొడ్డి కిరణ్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, డీకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దొడ్డి కిరణ్ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచారు. కొన్నాళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చంద్రనగర్‌కు చెందిన ఇమంది సత్యవతికి నిత్యావసర సరకులు, నగదు అందించారు. కార్యక్రమలలో తులసి, గణేష్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జియ్యానికి మహిళల సత్కారం



శ్రీధర్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నేతలు

విశాఖ విద్య: అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ బలోపేతంలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా నేతలను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అభినందించారు. అనంతరం మహిళలంతా కలిసి శ్రీధర్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి దుర్గానగర్‌లో శనివారం పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు అందజేశారు. దుర్గానగర్ నివాసముంటున్న ధరిమిరెడ్డి సత్యవేణి అనారోగ్యానికి గురికావడంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రూ.3,42,780 మంజూరు కావడంతో శనివారం ఎమ్మెల్యే గణబాబు చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. అదేవిధంగా టీడీపీకాలనీలో నివాసముంటున్న గంగడ కుమారి వైద్యఖర్చుల నిమిత్తం రూ.87,295 చెక్కును లబ్దిదారునికి అందజేశారు.

ప్రమాదవశాత్తు రైలు కింద పడి వ్యక్తి మృతి



జగన్ మృతదేహం

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు యల్లపానిపాలెం సంతోష్‌నగర్‌కు చెందిన పాలమరెట్టి జగన్ (36) ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందాడు. పాత గోపాలపట్నం వద్ద జువ్వాలమ్మ అమ్మవారి ఆలయానికి వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మృతుడు డాక్‌యార్డులో ఉద్యోగం చేస్తున్నాడు. మృతునికి భార్య ప్రియ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యాదవ ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఆచార్యులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఏయూ మైదానంలో ఈ పోటీలను ఆచార్య ఎస్.హరనాథ్, ఆచార్య ఎస్.విజయ్‌మోహన్‌లు ప్రారంభించారు. క్రికెట్ పోటీల్లో విజేతగా గొంప శ్రీనివాస్ టీం, రన్నర్‌గా బొట్ట రామచందర్ రావు టీంలు నిలచాయి. ఆదివారం షెటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో దువ్వి గోవింద్, డొక్కర శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్, కొయ్య నరసింగరావు, బందం రాజు, నమ్మి గణేష్, కోన పోలారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్లకోమా వారోత్సవాలు



డాక్టర్ మీనాక్షి

సీతంపేట: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ఏటా నిర్వహిస్తున్న గ్లకోమా (నీటి కాసులు) వారోత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 15 వరకు నిర్వహిస్తామని జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి తెలిపారు. ఈ వారం రోజుల్లో రోజూ ఉదయం 9 గంటల నుంచి రామాటాకీస్ సమీపంలో గల ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ప్రత్యేక గ్లకోమా స్క్రీనింగ్ నిర్వహిస్తామన్నారు. గ్లకోమా వైద్య నిపుణులు డాక్టర్ సౌజన్య, వాణిశ్రీ వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ముఖ్యంగా కళ్లద్దాలు వాడుతున్న వారు, రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులు తప్పకుండా గ్లకోమా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పారా మెడికల్ సిబ్బందితో గ్లకోమా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేత్రపర్వం.. నిత్య కల్యాణం

- ఘనంగా సహస్ర నామార్చన
- అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వామికి సహస్రనామార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువు దీర్చి, 1001నామాలతో అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

కమనీయం..కల్యాణం

అప్పన్న నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉత్సవ మూర్తులను ఉంచి, ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా జరిగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి గరుడసేవ శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై ఆసీనులను చేసి, అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. హారతి అందజేశారు.

రేపు స్టీల్‌క్లబ్‌లో 'ఆడవాళ్లు మీకు జోహార్లు'

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1 స్టీల్‌క్లబ్‌లో సోమవారం 'ఆడవాళ్లు మీకు జోహార్లు' కార్యక్రమం నిర్వహిస్తున్నామని స్టీల్‌క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి రవికుమార్ తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆ రోజు ఉదయం 9.30 నుంచి 11.30 వరకు, సాయంత్రం 1.30 నుంచి 3 గంటల వరకు పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు.

ఆసక్తి కలిగిన వారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 90529 87648ను సంప్రదించాలని తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ పీఆర్ బిషోయి సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం, కోరాపుట్ జిల్లాకు చెందిన గోబర్ధన టిక్రి, చంద్ర పాంగి విశాఖపట్నం మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. 18.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

- జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో కర్ణాటక రాష్ట్రం, బెంగళూరుకు చెందిన అస్గర్ ఆలీ, సయ్యద్ తన్వర్ విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు ఆర్పీఎఫ్ సిబ్బంది గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. 5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

బ్రెస్ట్ క్యాన్సర్ ప్రాణాంతకం కాదు



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రావీణ్య, కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

గోపాలపట్నం: బ్రెస్ట్ క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రావీణ్య అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ 92వ వార్డు గోపాలపట్నం బెహరా ఆస్పత్రి ప్రాంగణంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్రెస్ట్ క్యాన్సర్ ఏ విధంగా గుర్తించాలి, వైద్యులను ఎపుడు సంప్రదించాలనే విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ వ్యాధి వంశపారంపర్యంగా, ఆహార అలవాట్ల ద్వారా వస్తుందని తెలిపారు. మహిళలు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 91వ వార్డు కార్పొరేటర్ కుంచె జ్యోత్స్న, 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, 2వ వార్డు కార్పొరేటర్ బీవీవీఎస్ దేవిలను బెహరా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బెహరా రవితేజ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యూట్రిషియన్ డాక్టర్ సృజన పాల్గొన్నారు.

'ప్రిన్సిపాల్‌పై నిష్పక్షపాతంగా విచారణ జరపాలి'

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయ్‌బాబు తీరుపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఆల్ ఇండియా డెమోక్రాటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్(ఏఐడీఎస్‌వో) జిల్లా అధ్యక్షుడు కె.అభిలాష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కళాశాలలో బీబీఏ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థిని కొద్ది రోజుల కిందట యూనిఫాం ధరించకుండా కాలేజీకి వచ్చినందుకు ప్రిన్సిపాల్ ఆమెను మందలించడంతోపాటు ఫొటో తీసి కళాశాల అధ్యాపకుల గ్రూప్స్‌లో పెట్టిన విషయంపై ఆ విద్యార్థిని విద్యా శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా.. దీనిపై ఈ నెల 12న విచారణ చేయబోతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఏ విద్యార్థి అయినా యూనిఫాం ధరించి కళాశాలకు రాకపోతే.. ఆ విద్యార్థితో మాట్లాడి సరిదిద్దాలే తప్పా ఫొటో తీసి అధ్యాపకుల గ్రూప్‌ల్లో పెట్టడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. ఇలా చేయడం ద్వారా ఆ విద్యార్థినిని అవమానించినట్లు అవుతుందన్నారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

మహిళలకు వందనం

- ఘనంగా మహిళా దినోత్సవం
- వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు సత్కారం



లక్కీ అమర్ పాఠశాలలో కార్పొరేటర్ లావణ్యను సత్కరిస్తున్న పాఠశాల యాజమాన్యం



వైఎస్సార్‌సీపీ నాయకురాలు ధనలతకు కేక్ తినిపిస్తున్న మహిళలు



ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న మహిళా అధికారులు

మల్కాపురం: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పారిశ్రామిక ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. పలు రంగాల్లో రాణిస్తున్న మహిళ నాయకురాలను, అధికారులను ఘనంగా సత్కరించారు. 58వ వార్డు పిలకవానిపాలెం వద్ద గల లక్కీ అమర్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవరావు, ఇతర ఉపాధ్యాయినులు సత్కరించారు. 60వ వార్డు శ్రీహరిపురంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు, కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ డైరెక్టర్ మళ్ల ధనలతను సత్కరించారు. మల్కాపురం వద్ద గల ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో వేడుకలు వైభవంగా జరిగాయి. ఏపీఈపీడీసీఎల్ (విద్యుత్ ఉపకేంద్రం) ఏ.డీ ఐ.మాధవి, శ్రీహరిపురం ఏ.ఈ కె.పావని, పెదగంట్యాడ ఏ.ఈ ఎం.జ్యోతి తదితరులు కేక్ కట్ చేశారు. 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమణికుమారిని ములగాడ మండల విద్యాశాఖ అధికారులు వేంకటేశ్వరరావు, త్రినాథరావులు ఘనంగా సత్కరించారు. గాజువాక ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ సంఘ్ యూనియన్ ఆధ్వర్యంలో గాజువాక డిపో వద్ద వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా ప్రభుత్వ విప్ పి.గణబాబు పాల్గొని డిపో మేనేజర్ ప్రవీణ, మహిళ కండక్టర్, కొరియోగ్రాఫర్ జాన్సీ (పల్సర్ బైక్ జాన్సీ)ని ఇతర మహిళా కండక్టర్లను, అధికారులను సత్కరించారు.

సామాజిక సేవా కార్యకర్త, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు, ప్రతిభ పబ్లిక్ పాఠశాల ఉపాధ్యాయిని తోనంగి వెంకటరమణియాదవ్‌ను స్థానిక మహిళలు సత్కరించారు. అలాగే 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్‌ను వార్డు ప్రాంత పలువురు మహిళలు ఘనంగా సత్కరించారు.



మల్కాపురం జీవీఎంసీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని సత్కరిస్తున్న అధికారులు



కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్‌ను సత్కరిస్తున్న మహిళలు

హెల్దీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

విశాఖ విద్య: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మద్దిపాలెం గ్రీన్ బెల్ట్ వాకింగ్ పార్కులో హెల్దీ వాకర్స్ అసోసియేషన్‌లో భాగమైన స్త్రీ శక్తి హెల్దీ వాకర్స్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలను జరుపుకున్నారు. హెల్దీ వాకర్స్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈటి వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షురాలు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సతీమణి జియ్యాని దుర్గముఖ్య అతిథిగా విచ్చేసి మహిళల నుద్దేశించి ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. సేవా కార్యక్రమాల్లోనూ హెల్దీ వాకర్స్ సభ్యులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జియ్యాని దుర్గను హెల్దీ వాకర్స్ సభ్యులు సత్కరించారు. మొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



తోనంగిని వెంకటరమణయాదవ్‌ను సత్కరిస్తున్న మహిళలు



గాజువాక ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణను సత్కరిస్తున్న గణబాబు



వేడుకలో పాల్గొన్న హెల్దీ వాకర్స్ సభ్యులు